నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

శనివారం SATURDAY
14.12.2024

కరీంనగర్ KARIMNAGAR

పేజీలు: 16
Pages: 16

సంపుటి (Volume): 14 || సంచిక (Issue): 169 || వెల (Price) రూ.6.50

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

కేసీఆర్ హయాంలో అప్పు 3.17 లక్షల కోట్లు

కాంగ్రెస్ దుష్ప్రచారం 7 లక్షల కోట్లు!

ఒక్కో విషపుచుక్క ప్రోదిచేసి కాంగ్రెస్ సృష్టించిన అభాండాల భాండం బద్ధలైంది.

అప్పులపై తప్పుడు కూతలకు చెంపచెళ్లుమనే సమాధానం దొరికింది.

పదే పదే ప్రజలపై రుద్దిన అబద్ధపు ప్రచారం ఎట్టకేలకు పటాపంచలైంది.

అభివృద్ధిని చిన్నగాచూపి, అప్పును భూతద్దంలో చూపిన కుతంత్రం బట్టబయలైంది.

అధికార యావలో కాంగ్రెస్ ఇన్నాళ్లు సాగించిన 'అప్పుల కుప్ప' ప్రాపగాండాను రిజర్వ్‌బ్యాంక్ తాజా నివేదిక నిట్టనిలువునా చీల్చిపారేసింది.

వాస్తవాల పునాదులపై ఆర్బీఐ ప్రకటించిన లెక్కలు.. కాంగ్రెస్ కత్తిగట్టి సాగించిన 'మిత్తి'మీరిన ప్రచారాన్ని ముక్కలు ముక్కలు చేశాయి.

కేసీఆర్ పట్టించుకోలేదని అందామంటే.. పదేండ్ల పసికూన రాష్ట్రం అన్ని సూచీల్లో దేశంలోనే అగ్రభాగానికి చేరింది. అభివృద్ధే చేయలేదని అందామంటే.. కండ్లముందు తెలంగాణ ప్రగతి ప్రదీప్తి మిరుమిట్లుగొల్పుతున్నది. సంపదకు లోటులేదు.. సంక్షేమానికి కొరత రాలేదు. దీంతో కాంగ్రెస్ అబద్ధాలను ప్రచారంలో పెట్టింది. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని బురదచల్లింది. ధనిక రాష్ట్రంగా ఎదిగిన తీరును దాచి.. బాకా చానళ్లతో, భజంత్రీ పత్రికలతో తప్పుడు కథనాలను వండివార్చింది.

అధికార పీఠంపై కూర్చున్నప్పటికీ కాంగ్రెస్ తీరు మారలేదు. పాల్టీగా సాగించిన తప్పుడు ప్రచారాన్నే ప్రభుత్వ వేదికలపైనా కొనసాగించింది. పదేండ్లలో 7 లక్షల కోట్ల అప్పు చేశారంటూ ఎవరో గాలి గన్నారావు మాటల్ని పట్టుకుని సీఎం రేవంత్ సైతం అధికారిక సమావేశాల్లో ఆరోపణలకు దిగారు. నిజాలే నివ్వెరపోయేలా శ్వేతపత్రాల పేరుతో అబద్ధాలకు సున్నంవేశారు.

ఇప్పడవన్నీ పటాపంచలయ్యాయి. రిజర్వ్ బ్యాంక్ తాజాగా విడుదల చేసిన హ్యాండ్‌బుక్‌లో కాంగ్రెస్ ఇన్నాళ్లూ సాగించిన అబద్ధపు ప్రచారం శుద్ధ తప్పేనని తేలిపోయింది. పదేండ్లలో తెలంగాణ చేసిన అప్పు 3.17 లక్షల కోట్లేనని ఆధారాలతో, అంకెలతో ఆర్బీఐ సుస్పష్టం చేసింది. సమైక్య పాలకుల నుంచి వారసత్వంగా వచ్చిన రుణం మరో రూ.72 వేల కోట్లని వెల్లడించింది. అన్నీ కలిసినా తెలంగాణ అప్పు 3.87 లక్షల కోట్లేనని కుండబద్దలు కొట్టింది. ఆర్బీఐ లెక్కల తర్వాత కాంగ్రెస్ నేతల నోట మాట పడిపోయింది.





కేసీఆర్ 3.17 లక్షలకోట్ల అప్పు చేసి తెలంగాణను పునర్నిర్మించారన్నది వాస్తవం. జీఎస్డీపీలో దేశంలోనే అగ్రభాగాన నిలిపిందీ వాస్తవం. సంపద పెంచి ప్రజలకు పంచిందీ వాస్తవం. కాళేశ్వరం నుంచి యాదాద్రి దాకా.. సెక్రటేరియట్ నుంచి కలెక్టరేట్ల దాకా.. అడుగడుగునా రుణ సద్వినియోగం కనపడుతున్నది. 3 లక్షల కోట్లతో 30 లక్షల కోట్ల సంపదను సృష్టించి, అప్పును తెలంగాణ ఆస్తిగా మార్చిన కేసీఆర్ కౌశలం కండ్లకు కడుతున్నది.

మరి కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. ఈ పన్నెండు నెలల్లో రేవంత్ ప్రభుత్వం చేసిన అప్పు అక్షరాలా 80 వేల కోట్లు! ఇది 60 ఏండ్ల ఉమ్మడి రాష్ట్ర అప్పు కన్నా ఎక్కువ. మరి ఈ అప్పుతో చేపట్టిన కొత్త ప్రాజెక్టు ఏది? మొదలుపెట్టిన కొత్త పథకం ఏమున్నది? కూలగొట్టుడే తప్ప.. కొత్తగా తట్టెడు మట్టి కూడా తీయని సర్కారు.. 80 వేలకోట్లు అప్పు తెచ్చి చేసిందేంది? సాధించిందేంది?

రేవంత్.. ఆర్బీఐ నివేదికపై ఇప్పుడేమంటారు?

- సమైక్య పాలన వారసత్వంగా వచ్చిన రుణం 72,658 కోట్లు
- తెలంగాణ పునర్నిర్మాణానికి కేసీఆర్ హయాంలో 3 లక్షలకోట్లు
- అన్నీ కలిపితే 3.87 లక్షల కోట్లు కూడా దాటని మొత్తం అప్పు
- ఆ రుణంతో 30 లక్షల కోట్ల సంపద సృష్టించిన కేసీఆర్ సర్కార్
- పదేండ్ల పాలనలో గణనీయంగా పెరిగిన తెలంగాణ ఆదాయం
- అన్ని రంగాలకు జవసత్వాలు.. పెరిగిన ప్రజా జీవన ప్రమాణాలు
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హ్యాండ్‌బుక్-2024లో తేటతెల్లం
- ఏడాదిలోనే రూ.80 వేల కోట్లు అప్పు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- కొత్త ప్రాజెక్టు నిర్మించలేదు.. కొత్త పథకం అమలు చేయలేదు
- సమైక్య పాలకుల రుణాన్ని ఏడాదిలోనే దాటేసిన రేవంత్ సర్కార్